క్లుప్తంగా

వలంటీర్లకు సన్మానం



వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 43,44,45,46 డివిజన్‌లో సోమవారం వలంటీర్లకు వందనం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హాజరై వలంటీర్లను సన్మానించారు. వలంటీర్ సేవలు, ప్రభుత్వ పథకాల అమలుతీరు తదితర అంశాలపై వారితో కాసేపు మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్ప, సీతాపతి, అల్తాఫ్, శివారెడ్డి, జ్ఞాన జగదీష్, కొల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



డీఎస్పీ శ్రీనివాసమూర్తి

చిత్తూరు అర్బన్: నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసమూర్తి అన్నారు. చిత్తూరు నగర ట్రాఫిక్ డీఎస్పీగా శ్రీనివాసమూర్తి సోమవారం అదనపు బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చర్చివీధి, బజారు వీధిలో ప్రత్యేక డ్రైవ్ చేపడతామన్నారు. పీసీఆర్ ప్రాంతంలో విచ్చలవిడిగా పార్కింగ్ చేస్తే కుదరదన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. వ్యాపారులు ప్రజలకు ఇబ్బంది కలిగించే పని పెట్టుకోవద్దని హెచ్చరించారు. మైనర్‌కు బండి ఇస్తే తల్లిదండ్రులకు కేసులు తప్పవని సూచించారు.

నేడు తగ్గువారిపల్లెలో గంగజాతర

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె, ఆర్‌ఆర్ నగర్, మొగిలి వెంకటగిరి గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతర ప్రారంభం అవుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జాతరలో భాగంగా మంగళవారం అమ్మవారికి అంబళ్లు, పొంగళ్లు సమర్పించనున్నారు. బుధవారం అమ్మవారికి పూజలు నిర్వహించి రాత్రి జలప్రవేశానికి తరలించనున్నట్లు చెప్పారు.

గుడిపాల నుంచి భారీ బైక్‌ర్యాలీ

గుడిపాల: చంద్రబాబునాయుడు పేదల ఇంటి స్థలాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై సోమవారం ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన చీలాపల్లె నుంచి చిత్తూరు వరకు మండల నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. 27 పంచాయతీల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

2న మండల సర్వసభ్య సమావేశం

గుడిపాల: మండల సర్వసభ్య సమావేశం జూన్ 2వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరు కావాలని కోరారు.

వీఓఏల నిరసన

ఐరాల: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనం వద్ద సోమవారం మండల వీఓఏలు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెర్జింగ్ విధానాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఏపీఎం ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

నేడు గంగజాతర

గుడిపాల: మండలంలోని వసంతాపురం, కుప్పిగానిపల్లెలో మంగళవారం గంగజాతర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అమ్మవారికి అంబలి సమర్పణ, పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేటి నుంచి మహాకుంభాభిషేకం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం కుమ్మరవీధిలోని సాయిబాబా మందిర మహాకుంభాభిషేక పూజలు మంగళవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

తవణంపల్లె: ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరంజని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని తవణంపల్లె, దిగువమారేడుపల్లె, టి.పుత్తూరు గ్రామాల్లో ఉపాధ్యాయులు మూడు బృందాలుగా ఏర్పడి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

కిల్లారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కఠారి కుమార్ అన్నారు. మండలంలోని కిల్లారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన తమ సిబ్బందితో కలిసి రోగులకు వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటివద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. సిబ్బంది హరిప్రియ, చంద్ర, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుండ్లకట్టమంచి ఉన్నత పాఠశాల



గ్రామాల్లో ఇంటర్ అడ్మిషన్లు చేస్తున్న అధ్యాపకులు



దశాబ్దం నాటి కల సాకారం

బంగారుపాళెంలో బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో మండలవాసుల దశాబ్దం నాటి కల నెరవేరింది. మండలంలోని అన్ని గ్రామాలకు అందుబాటులో ఉండేలా గుండ్లకట్టమంచిలో కళాశాల ఏర్పాటు చేసింది. ఈ సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభించింది. తొలుత రెండు ఇంగ్లిషు మీడియం కోర్సులను మాత్రమే ప్రవేశ పెట్టింది. గ్రామీణ ప్రాంతాల బాలికలకు ఉన్నత విద్య అందుబాటులోకి వచ్చింది.

- గుండ్లకట్టమంచిలో బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు
- ఇంగ్లిషు మీడియం బైపీసీ, సీఈసీ కోర్సుల్లో అడ్మిషన్లు
- జూన్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభం

బంగారుపాళెం: గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల విద్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి పరచి ఆధునిక వసతులకు కల్పించడంతోపాటుగా నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తోంది. మండలానికి ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చారు సీఎం వైఎస్ జగన్. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి కల సాకారం చేశారు. ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించేందుకు ఇబ్బందులు పడే గ్రామీణ ప్రాంత బాలికలకు జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. మండలంలోని గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేసింది. బైపీసీ, సీఈసీ ఇంగ్లీషు మీడియం కోర్సులను తీసుకువచ్చింది. బోధించేందుకు 20 ఏళ్ల అనుభవం కలిగిన అధ్యాపకులను నియమించింది. గండ్లకట్టమంచి గ్రామంలో బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల చుట్టు పక్కల సుమారు 20 గ్రామాలకు అనుకూలంగా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. కేవలం మూడు, నాలుగు కిలో మీటర్ల దూరంలోనే కళాశాల ఉండడం వల్ల ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని బాలికల తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు ఉండవు



ఇప్పటివరకు 10వ తరగతి పాసైన బాలికలు ఇంటర్ చదివేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దాంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. గుండ్లకట్టమంచి గ్రామంలో బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు తప్పాయి. రవాణా ఖర్చులు సైతం తగ్గిపోతాయి. జూనియర్ కళాశాల ఏర్పాటు గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.

–ఉదయశ్రీ, విద్యార్థి, గుండ్లకట్టమంచి

బాలికలకు వరం



గ్రామీణ ప్రాంతాల్లో ఆడపిల్లలు దూరాభారం వెళ్లి చదివించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో కొందరు తల్లిదండ్రులు ఇష్టపడరు. అలాంటి వారి కోసం ఈ కళాశాల ఓ వరమని చెప్పాలి. చుట్టుప్రక్కల 10 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో బాలికలకు గుండ్లకట్టమంచిలో ఇంటర్ చదువుకునేందుకు అవకాశం రావడం ఆనందంగా ఉంది.

–చంద్రారెడ్డి, స్థలదాత, మాజీ సర్పంచ్

సంతోషంగా ఉంది



బాలికా విద్యకు జగన్ మామయ్య అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. చదువుతో పాటుగా బాలికల భద్రతకు చర్యలు తీసుకుని భరోసా కల్పిస్తున్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్యకు అవసరమైన చేయూతను అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో బాలికల కోసం ప్రత్యేక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. బాలికలకు అనుకూలంగా ఉంటుంది.

–కీర్తన, విద్యార్థి, గుండ్లకట్టమంచి

అడ్మిషన్లు ప్రారంభం



గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వం 2023–24 సంవత్సరానికి గాను బాలికల జూనియర్ కళాశాల మంజూరు చేసింది. బైపీసీ, సీఈసీ ఇంగ్లీషు మీడియం కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 30 మంది బాలికలు జూనియర్ ఇంటర్‌లో చేరారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

–బేరినాథ్, ప్రధానోపాధ్యాయులు, గుండ్లకట్టమంచి

పేదలంటే అంత చులకనేల బాబు?



బైక్ ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- నగరంలో భారీ బైక్ ర్యాలీ

చిత్తూరు కార్పొరేషన్: పేదలంటే అంత చులకన ఎందుకు బాబు అని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మండిపడ్డారు. పెత్తందారులకు పేదలకు మధ్య యుద్ధం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో నగరంలో వందలాది బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు గాంధీవిగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. రాష్ట్రంలో 35 లక్షల మంది పేదలకు ఇంటి స్థలాలు ప్రభుత్వం ఇస్తోందని చెప్పారు. టీడీపీ హయాంలో ఎంత మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారో ప్రకటించాలని సవాల్ విసిరారు. అభివృద్ధి చూసి ఓర్వలేని బాబు పేదల నివాసాలను సమాధుల స్థలంతో పోల్చడం తప్పన్నారు. టీడీపీకి ఇదే చివరి మహానాడు అవుతుందని జోస్యం చెప్పారు. హామీల పేరుతో మరోసారి ప్రజలకు వెన్నుపోటు పొడవాలని చంద్రబాబు కుట్ర చేస్తున్నారన్నారు. ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితిలో లేరని ఎద్దేవా చేశారు. పేదలను కించపరిచేలాగా మాట్లాడటం చంద్రబాబుకు అలవాటుగా మారిందని మేయర్ అముద తెలిపారు. కార్యక్రమంలో మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, నాయకులు త్యాగ, అప్పు, సంపత్, వినాయకబాలాజీ, ఎల్‌బీఐ లోకేష్‌రెడ్డి, శేఖర్, షరీఫ్ పాల్గొన్నారు.

వలంటీర్లే ప్రభుత్వ సారథులు



బంగారుపాళెం వలంటీర్ల సన్మానంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, నాయకులు

బంగారుపాళెం: వలంటీర్లే ప్రభుత్వ సారథులని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బంగారుపాళెం గ్రామ సచివాలయం–2 ఆవరణలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర వలంటీర్లకు ఎమ్మెల్యే శాలువలు కప్పి ప్రశంసా పత్రాలు, మెడల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్ర పోషించేది వలంటీర్లేనని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప ఆశయంతో వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. వలంటీర్లు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పనిచేయాలన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతు సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు. బంగారుపాళెం రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం రైతులకు వేరుశెనగ విత్తన కాయలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 26 రైతు భరోసా కేంద్రాల్లో వేరుశెనగ విత్తన కాయలు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. మండలానికి 2,055 క్వింటాళ్ల వేరుశెనగ కాయలు వచ్చాయన్నారు. వేరుశెనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిరుపేదల పక్షపాతి సీఎం జగన్

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. నిరుపేదలకు అందజేసిన ఇళ్ల స్థలాలను, శ్మశాన స్థలాలంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసిస్తూ పోలీస్ స్టేషన్ వద్ద నుంచి బంగారుపాళెం –2 గ్రామ సచివాలయం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ ఉషా, సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఎంపీడీవో హరి ప్రసాద్, తహసీల్దార్ బెన్నురాజ్, ఏడీ మధుసూదన్ రెడ్డి, ఏఓ పద్మజ పాల్గొన్నారు.

నేటి నుంచి పాలేటమ్మ గంగ జాతర





ప్రత్యేక అలంకరణలో పాలేటమ్మ, అమ్మవార్ల విద్యుత్ దీపాలంకరణ

ఐరాల: మండల కేంద్రంలో రెండు రోజుల పాటు పాలేటమ్మ గంగ జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపార్యంపర ధర్మకర్త బాలాజి తెలిపారు. మంగళవారం ఉదయం అమ్మవారి శిరస్సు ప్రతిష్ఠ, ఘటనైవేద్యం, అమ్మవారి విశ్వరూపం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించనున్నారు. సాయంత్రం పిండి దీపాలతో పూజలు, అమ్మవారి భజన, రాత్రి అన్నదానం, కోలాటాలు, చెక్కభజన, గెరిగ డ్యాన్స్, డ్యాన్స్ బేబి డ్యాన్స్, అమ్మవారి కథా కాలక్షేపం ఉంటుందని చెప్పారు. బుధవారం ఉదయం అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు, సాయంత్రం అమ్మవారి లడ్డూ వేలం, చెక్కల భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారి నిమజ్జనం నిర్వహించనున్నట్లు వివరించారు.

స్పందనకు అర్జీల వెల్లువ

పూతలపట్టు: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు అర్జీలు వెల్లువెత్తాయి. సోమవారం తహసీల్దార్ విజయభాస్కర్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అందులో అధికంగా రెవెన్యూకు సంబంధించినవే వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు, మండల ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.7.93 లక్షలు



అర్ధగిరి క్షేత్రంలో హుండీ కానుకల లెక్కింపు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా రూ.7,93,564 ఆదాయం వచ్చినట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్ర రెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. క్షేత్రంలో సోమవారం 62 రోజుల హుండీ కానుకలను లెక్కించగా రూ.7,93,564 వచ్చినట్లు వివరించారు. ఈ లెక్కింపులో ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ పి.మణిరాజశయన, అరగొండ మేనేజర్ శివమానందరెడ్డి, మహిళా పోలీసులు వనిత, గౌరి, డీఏ సాయిప్రియ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందింది. విజయవాడకు చెందిన హోల్‌కాన్ డెవలపర్స్ ప్రైవైట్ లిమిటెడ్ అధినేత రాజేష్ స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అభివృద్ధి పనులకు రూ.లక్ష విరాళం అందించారు. దాతకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.



విరాళం ఇస్తున్న దాత రాజేష్

మొరంపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు

ఐరాల: మండలంలోని మొరంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ అరవింద్ 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తవణంపల్లె: గర్భిణులు కాన్పు అయ్యే వరకు ఆరోగ్యంపై తగు శ్రద్ధ చూపాలని వైద్యాధికారి మోహన్ వేలు అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మాధవరంలో 104 ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 55 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, చాముండీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు ద్రాక్షాయణి, సావిత్రి పాల్గొన్నారు.

స్పందన వినతులపై త్వరగా చర్యలు

చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం 11 వినతులు అందినట్లు నగర కమిషనర్ అరుణ చెప్పారు. ఇందులో వచ్చే ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం 'స్పందన' కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన వినతులపై శాఖాధిపతులు సత్వరం విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమంలో మెప్మా 4, టీపీవో 3, ఇంజినీరింగ్ 2, ప్రజారోగ్య విభాగం –1, హౌసింగ్ –1 చొప్పున మొత్తం 11 వినతులు అందాయి. కార్యక్రమంలో మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం చెక్కు అందజేత

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో విధులు నిర్వహిస్తూ ఈ నెల 18వతేదీ అనారోగ్యంతో మృతి చెందిన పురుషోత్తం కుటుంబానికి సోమవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి పోలీసుశాఖ తరపున ఆర్థిక సాయం కింద చెక్కును అందించారు. ఐడీఆర్‌ఎఫ్ ఫండ్ రూ. ఒక లక్ష చెక్కును మృతుడి భార్య విజయలక్ష్మికి అందజేశారు. మృతుడి కుటుంబానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ

నేడు 'నాలుగేళ్ల సంబరాలు'

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం స్థానిక కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నారు. అనంతరం సంక్షేమ, అభివృద్ధి అంశాల మీద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

చిత్రలేఖనం పోటీలు రేపు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని తపోవనం పాఠశాలలో సాక్షి ఆధ్వర్యంలో బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన బాల, బాలికలు పోటీల్లో పాల్గొనాలనుకుంటే 9440290051ను సంప్రదించవచ్చు. ఈ పోటీలకు ఎలాంటి ప్రవేశ రుసుం లేదని, అందరూ ఉచితంగా పాల్గొనవచ్చని చెప్పారు.

బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. అధ్యాపకులు సోమవారం పలు గ్రామాల్లో విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి కళాశాలలో ఉన్న ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కనకాచ్చారి భాస్కర్ రెడ్డి, నరసింహా రెడ్డి, ఉషారాణి, మధు, రాజరాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థిని